ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 26 నవంబరు 2024





నందివెలుగు-కొల్లిపర మధ్య చేలల్లో యంత్రాలతో కోత కోసి, పొలాల రోడ్లపై ఆరబోసుకున్న రైతులు

- వైసీపీ సర్కారులో పట్టిన గ్రహణం నుంచి విముక్తి
- మారుమూల ప్రాంతాల్లో సైతం మరమ్మతు పనులు
- ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు మంజూరు



దుగ్గిరాలలో మంగళగిరి- తెనాలి రోడ్డు నిర్మాణ పనులు

రహదారులకు మహర్దశ



మంగళగిరి- తెనాలి రోడ్డు నిర్మాణ పనులు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు రహదారులను ఆవరించిన గ్రహణం ఎట్టకేలకు వీడుతున్నది. రహదారుల మరమ్మతులు, నిర్వహణ, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రహదారుల మరమ్మతు, విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే మూడుజిల్లాల్లో ప్యాచ్ వర్కులు, తక్షణ మరమ్మతుల కోసం గత నెలలో రూ. 35 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తాజాగా రహదారుల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది.

గుంటూరు జిల్లాకు రూ. 559.84 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని రహదారులు, వంతెనల నిర్మాణం, అభివృద్ధి కోసం 559.84 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలో 719 కిలోమీటర్ల మేర రహదారుల్లో మరమ్మతులు చేస్తారు. గుంతలు పూడ్చి రోడ్లు వేస్తారు. వాటితోపాటు ఆగిపోయిన ఆర్వోబీలు, వంతెనలు నిర్మించడానికి కూడా నిధులు కేటాయించారు. ఎండీఆర్ ప్లాన్ కింద జిల్లాలోని 3 రహదారుల్లో 15.6 కి.మీ మేర రోడ్లు వేయనున్నారు. ఇతర జిల్లాలను కలిపే 4 రోడ్లలో 18.4 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద 3 రోడ్లలో 14.75 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. కాగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఫేజ్-1 కింద 262.64 కోట్లతో జిల్లాలోని 13 రోడ్లు 94.11 కి.మీ మేర నిర్మిచనున్నారు. బాగా దెబ్బతిన్న 12 రోడ్లలో 69.84 కి.మీ మేర మరమ్మతులు చేపట్టగా, 50 రోడ్లకు సంబంధించి 222 కి.మీ మేర తక్షణ మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేపట్టనున్నారు. ఇంటెన్సివ్ ప్యాచ్ వర్కుల కింద 19 రోడ్లలో 107.79కి.మీ మేర, అంచులు తెగిన రోడ్ల ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కింద 33 రోడ్లలో 176.63 కి.మీ మేర రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటితోపాటు హనుమాన్‌పాలెం వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి రూ. 28 కోట్లు కేటాయించారు. కొండవీడు ఘాట్ రోడ్డుకు 6.8 కోట్లు కేటాయించారు. వెనిగండ్ల-జొన్నలగడ్డ రోడ్డు, గుంటూరు- నిడమర్రు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గుంటూరు- బాపట్ల- చీరాల రోడ్డు, గుంటూరు- ఫిరంగిపురం రోడ్డు, ఎయిమ్స్ గేటు నుంచి ఎన్‌హెచ్- 16 వరకూ అప్రోచ్ రోడ్డుల నిర్మాణానికి మోక్షం లభించింది. మంగళగిరి-

(మిగతా 8వ పేజీలో..)

- ధాన్యం తేమ సాకుతో రైతు నిలువు దోపిడీ
- వాతావరణ మార్పులతో రైతుల్లో భయం... భయం
- యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు
- ప్రభుత్వం ఇచ్చిన పరిమితి 17 శాతం
- అదనపు తేమ శాతాలు చూపి ఎదురు వసూలు చేస్తున్న మిల్లర్లు
- బస్తాకు రూ. 200 నుంచి రూ.300 కడితేనే ధాన్యం కొనేది!
- ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 1740
- బయటి మార్కెట్‌లో ధర రూ.1300 నుంచి రూ.1400 వరకు



తేమ సాకు.. రైతుకు షాకు



ధాన్యం తేమ శాతాన్ని అంచనా వేస్తున్న పరికరం

తెనాలి, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయం... ఆరుగాలం పంచించిన ధాన్యం ఎక్కడ వర్షానికి తడిచిపోయోనన్న ఆందోళనతో యంత్రాలతోనే వరి కోతకు ప్రాధాన్యం ఇస్తున్నారు డెల్టాలోని రైతులు. అయితే కోత కోసిన ధాన్యాన్ని వెంటనే అమ్మకుండా ఆరబెట్టి, తేమ తగ్గాకే అమ్మకాలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో రైతులు ఆరబెడితే ఎక్కడ తడిచిపోయి అసలుకే నష్టం వస్తుందన్న భయంతో అమ్మటానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వీరి భయాన్ని, వాతావరణ ప్రతికూలతను మిల్లర్లు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. రైతులను నిలవు దోపిడీ చేసేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక మార్గాలను మార్కెటింగ్ కోసం ప్రవేశపెడితే, అవేమీ రైతులకు అక్కరకు రావటంలేదు. కృష్ణా డెల్టాలో 2024 ఖరీఫ్ పంట వచ్చేసింది. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఉన్న కోతలు మొదలుపెట్టేశారు. అయితే ధాన్యం అమ్ముకోటానికి గతంలోలాగా ఆర్‌ఎస్‌కేల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాట్సప్‌లో హాయ్ అని పెడితేచాలు... ధాన్యం అమ్మేసుకునేలా మార్పులు కూడా చేశారు. ఇదంతా బాగానే ఉంది. అయితే ఈ తతంగం మొత్తం పూర్తయిన తర్వాత వెళ్లాల్సింది మిల్లర్ల దగ్గరకే కావటంతో వారి దగ్గర దోపిడీకి మాత్రం తెరపడలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకరాలలో ఖరీఫ్ వరి సాగవుతోంది. వీటిలో ఒక్క ప్రకాశం జిల్లాలో, బాపట్ల జిల్లాలోని తీర మండలాల్లో కొన్నిచోట్ల మినహాయించితే, మిగిలిన విస్తీర్ణం మొత్తం వరి కోతకు సిద్ధమైంది. తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని, గుంటూరు, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలో కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, మరికొన్ని మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. మనుషులతో కోత కోయించే రైతులు మాత్రం వరుణుడిపై భారం వేసి, కుప్పలు వేసేందుకు వరి ఓదెలను చేలపైనే ఆరేవరకు ఉంచేస్తున్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో, వరి కోత కోసేందుకు, కుప్పలు వేసేందుకు కూలీలు రేట్లు పెంచేశారు. వీరిపరిస్థితి అటుంచితే, 70 శాతం మంది రైతులు యంత్రాలతోనే కోతకోసి, అమ్మేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తడిచిపోతే తర్వాత రేటు రాదని, పండించిన పంట దక్కకుండా పోతుందనే ఆందోళనతో కోత, కుప్ప, నూర్పిళ్లతో పని లేకుండా ఒకేసారి వరికోత యంత్రం సాయంతో కోసేసి, ధాన్యం అమ్ముకుంటున్నారు. అయితే యంత్రాల సాయంతో కోత కోసినప్పుడు ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు ఉంటోంది. అదే వాతావరణం బాగుంటే తేమ తగ్గేవరకు ఆరబెట్టి అమ్ముకునేవారు. అయితే వరుణుడి

(మిగతా 6వ పేజీలో..)

రెట్టింపు తేమ శాతం వసూలు చేస్తున్నారు

సాధారణంగా తేమ ఉన్న ధాన్యం ఆరబెడితే, ప్రతి పది బస్తాలకు ఒక బస్తా వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఒక రైతు 100 బస్తాల ధాన్యం మిల్లర్‌కు వేశారనుకుంటే, దీనిలో తేమ వల్ల తరుగు 10 బస్తాలు ఉండొచ్చు. అంటే ప్రభుత్వ ధర ప్రకారం రూ. 17,400 మిల్లర్‌కు నష్టం వచ్చే మాట వాస్తవమే. అయితే 100 బస్తాలకు రూ. 300 చొప్పున ఎదురు వసూలు చేస్తుండటంతో అన్ని బస్తాలపైనా రూ. 30వేలపైనే మిల్లర్‌లకు రైతు ఎదురు కట్టాల్సి వస్తోంది. అంటే దాదాపు రెట్టింపు రేటును తేమ శాతం సాకుగా చూపి రైతు నుంచి ముందే దోచేస్తున్నారు. అదే తేమ శాతాన్ని బట్టి ఒక శ్లాబ్ రేటును ప్రభుత్వమే నిర్ణయిస్తే అంత నష్టం ఉడదనేది రైతుల మాట.

ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి

ధాన్యం కొనుగోలుకు సంబందించి తేమ శాతం 17 వరకు, మట్టి, రాళ్లు, తాలు గింజల వంటివి ఇతర వ్యర్థాలు 1 శాతం వరకు ఉండొచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. చెడిపోవటం, రంగు మారటం, మొలకలు వంటివి ఉన్న ధాన్యమయితే 5 శాతం, పక్వతలేని, ముడుచుకుపోయిన గింజలు 3 శాతం, ఏ గ్రేడ్ రకంలో తక్కువ రకం కానీ, కేళీలు 3 శాతం వరకు ఉండొచ్చని సూచించింది. అయితే ప్రస్తుతం తేమ శాతం సమస్యగా మారింది. 17 శాతం లోపు తేమ ఉంటే, ఎ గ్రేడ్ రకానికి రూ. 1740 చెల్లిస్తారు. అయితే ఆపై తేమ శాతం ఉన్నవాటికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం ఇబ్బందికరంగా ఉన్న తరుణంలో తేమ ఉన్న ధాన్యాన్ని అమ్మక తప్పదని, ప్రభుత్వ కొనకపోతే చివరకు దళారులకైనా తెగనమ్మక తప్పదని రైతులు చెబుతున్నారు. అయితే 17 శాతానికి మించిన అదనపు శాతాలకు 21 శాతం వరకు ప్రభుత్వమే ధరలో తరుగుదల నిర్ణయిస్తే, మిల్లర్ల దోపిడీ తగ్గుతుందనేది రైతుల విన్నపం.

- టీడీపీ దత్తత గ్రామంపై వైసీపీ కన్నెర్ర
- అసంపూర్తిగా ధర్మవరం లిఫ్ట్ ఇరిగేషన్
- 90 శాతం పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



ధర్మవరం వ్యూ

ఆధిపత్యం కోసం.. ఆగిన అభివృద్ధి

"దుర్గి మండలం ధర్మవరం టీడీపీ దత్తత గ్రామం. దానిని అప్పటి ఎంపీ రాయపాటి దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టారు. అలానే రైతులకు ఉపయుక్తమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూడా మొదలు పెట్టి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. తదనంతర పరిణామాల్లో వైసీపీ అధికారంలోకి రావడం, పంచాయతీ ఎన్నికల్లో ధర్మవరం గ్రామస్తులు ఏకగ్రీవానికి ఒప్పుకోకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే ఈ పథకాన్ని అడ్డుకున్నారు.. దీంతో వేల ఎకరాలకు సాగునీరందకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండల ప్రజలు ఈ పథకం ప్రారంభంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు."



మూలనపడ్డ మోటార్లు, పైపులు



జాక్వెల్ పాయింట్‌లో ఉపయోగించే పరికరాలు



బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద నిర్మాణం నిలిచిపోయిన జాక్వెల్

దుర్గి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి పల్లె ప్రగతిపథంలో దూసుకెళ్లాలని సత్సం కల్పించారు. అందులో భాగంగానే ప్రతి ప్రజాప్రతినిధి ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆ సమయంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యునిగా ఉన్న రాయపాటి సాంబశివరావు మాచర్ల నియోజకవర్గంలోని దుర్గి మండలం ధర్మవరం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధికి బాటలు వేశారు. రూ. 9 కోట్లతో గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, ఆర్వో ప్లాంటు, విద్యుత్ సబ్‌స్టేషన్, ఎల్ఈడీ వీధిదీపాలు, ఓబులేశునిపల్లె నుంచి గ్రామం దాకా తారు రోడ్డు ఏర్పాటు చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌కు శంకుస్థాపన

ధర్మవరం గ్రామానికి సమీపంలో బుగ్గవాగు రిజర్వాయర్ ఉన్నప్పటికీ పొలాలకు సాగునీరు లేక మెట్ట ఆధారిత పంటలు పండించుకోవాల్సి వస్తోందని, దీంతో రైతులు తమ గోడును అప్పటి ఎంపీ రాయపాటి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య పరిష్కారానికి బుగ్గవాగు డ్యాం రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం జరపాలని భావించారు. దీని ద్వారా ధర్మవరం, ఓబులేశునిపల్లె, దారివేముల గ్రామాలకు సంబంధించి 3704 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. అనుకుందే తడవుగా రూ. 35,93,70,000 అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. అక్టోబర్ 13, 2017వ తేదీన అనుమతులు కూడా లభించాయి. ఏడాదిన్నరలో కాంట్రాక్టర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి 90 శాతం పనులు కూడా పూర్తి చేశారు. అయితే తదుపరి ఎన్నికల కోడ్ రావడం, వైసీపీ అధికారంలోకి రావడం జరిగింది. మోటార్లు, జాక్వెల్‌కు సంబంధించిన మెటీరియల్, విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఉండిపోయాయి. పైపులైన్ పనులు, బుగ్గవాగు డ్యాం రిజర్వాయర్ వద్ద నిర్మించిన జాక్వెల్ పాయింట్ అసంపూర్తి నిర్మాణంగా నిలిచిపోయింది.

వైసీపీ ఆధిపత్యం అడ్డుకున్నారనే అక్కసుతో..

2019లో వైసీపీ అధికారం చేపట్టింది. ఆ తదుపరి స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో చాలాచోట్ల పంచాయతీలను వైసీపీ నాయకులు ఏకగ్రీవం చేయడంలో సఫలమయ్యారు. అలాగే మాచర్ల నియోజకవర్గంలోనూ జరిగింది. కేవలం రెండుచోట్ల మాత్రమే సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. అందులో ఒకటి రెంటచింతల మండలంలో పాలువాయి కాగా, మరొకటి దుర్గి మండలం ధర్మవరం. అయితే ధర్మవరంలో జనసేన నుంచి పోటీకి దిగారు. వీరికి టీడీపీ నేతలు మద్దతునిచ్చారు. ఆ సమయంలో జనసేన, టీడీపీ పొత్తు కూడా లేదు. కేవలం తమ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేశారని అండగా నిలిచారు. అయితే డబ్బు ఏరులైపారడంతో వైసీపీనే విజయం సాధించింది. కాగా తమ ఆధిపత్యాన్ని అడ్డుకున్నారనే అక్కసుతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు అడ్డుకున్నారు. కాంట్రాక్టర్‌పై బెదిరింపులకు దిగడంతో ఎక్కడిపనులు అక్కడ నిలిపివేసి కాంట్రాక్టర్ వెళ్లిపోయారనే ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అఖండ విజయం సాధించింది. చంద్రబాబునాయుడు మరోమారు ముఖ్యమంత్రి అయ్యారు. మాచర్ల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. దీంతో దుర్గి మండల ప్రజలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో పథకం ప్రారంభానికి నోచుకుంటుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

- క్రికెటర్ రషీద్‌కు ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలు
- చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో చోటు

ఐపీఎల్ జట్టులో..

గుంటూరు కుర్రోడు



రషీద్


గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలకు చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు దక్కించుకున్నది. సోమవారం జరిగిన వేలంలో రషీద్‌ని చెన్నై జట్టు కొనుగోలు చేసింది. అయితే ఆ జట్టులో దిగ్గజ ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రషీద్‌కు ఇస్తారో, లేదోనన్న అనుమానాలు ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే చెన్నై జట్టు రషీద్‌ని దక్కించుకోగా మ్యాచ్‌లలో ఆడే అవకాశం కల్పించలేదు. 20 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ స్వస్థలం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామం. రషీద్ బాల్యం ఇక్కడే గడిచింది. రషీద్ క్రికెట్ ప్రాక్టీసు కోసం ఆయన కుటుంబం గుంటూరు నగరానికి వలస వచ్చింది. ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఒక చిన్న ఇంటిలో నివాసం ఉంటున్నది.

రషీద్ ఇప్పటివరకు 17 ఫస్టుక్లాస్ మ్యాచ్‌లు ఆడారు. 30 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఒకసారి నాటౌట్‌గా నిలిచారు. 36.13 సగటుతో 1048 పరుగులు సాధించారు. ఇందులో ఇటీవలే హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో 203 పరుగుల డబుల్ సెంచరీతో మెరిశాడు. అలానే లిస్టు ఏ మ్యాచ్‌లు 8 ఆడి 62 పరుగులు మాత్రమే చేశాడు. టీ20లు 11 మ్యాచ్‌లు ఆడి 300 పరుగులు చేశాడు. 42.85 సగటుతో ఈ పరుగులు చేశాడు. టీ20లలో బెస్టు స్కోరు 100గా ఉన్నది. టీ20లలో స్ట్రైక్ రేట్ 139.54గా ఉన్నది. రషీద్ లెగ్‌స్పిన్ కూడా వేయగలిగిన ఆల్‌రౌండర్. అయితే ఆయనకు ఎక్కువగా బౌలింగ్ చేసే అవకాశాన్ని ఆయా జట్లు కల్పించలేదు. ఈ కారణంగా ఇప్పటివరకు రెండు వికెట్లు మాత్రమే తీశారు. రషీద్ అండర్-19 ప్లేయర్‌గా కూడా కొనసాగుతున్నాడు.

అవకాశాలు కల్పించాలి

ప్రతిభ ఉన్న క్రికెటర్లకు అవకాశాలు కల్పిస్తేనే వారు తమ సత్తాని నిరూపించుకోగలుగుతారు. ఈ సూత్రాని ఇండియన్ క్రికెట్‌లో మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలీ ఆచరణలో పెట్టడం వలనే ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి ఆటగాళ్లు తయారయ్యారు. ఆ తర్వాత ఎంఎస్ ధోని తను కెప్టెన్సీగా ఉండగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సురేష్ రైనా వంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. రషీద్ ముఖ్యంగా టెస్టు మ్యాచ్‌లలో సుదీర్ఘంగా ఆడగలిగిన సత్తా ఉన్నది. అలానే టీ20లలోనూ చురుకుగా బ్యాటింగ్ చేస్తాడు. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్ అతనికి అవకాశాలు కల్పించాలని క్రికెట్ అభిమానులుగా అందరం కోరుకుందాం.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు



8
- అమరావతి, కోటప్పకొండ, పెదకాకాని ఆలయాలను సందర్శించిన భక్తులు
- సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు

ప్రకృతి వరి.. నో వర్రీ

- గింజ పాలు దశలో పడిపోకుండా ఉన్న పైరు
- గుంటూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ వరి సాగు

8

సాహస జీవితం.. నదిపైనే జీవనం

- కృష్ణమ్మను నమ్ముకున్న మత్స్యకారులు
- గాజుల్లంక రేవు నుంచి శ్రీకాకుళానికి నిత్యం పడవ ప్రయాణం

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

- సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళ ప్రదర్శన

6

రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా...

చేర్రెడ్డి మంజులారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం నేడు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి



ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుటూరు జిల్లాల పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తొలివిడత ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6తో ముగియడంతో చాలా మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని, దీంతో ఎన్నికల కమిషన్ మరోమారు అవకాశం కల్పించిందని తెలిపారు. డిసెంబరు 6లోపు మరోసారి ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పొప్పులను కూడా ఇప్పుడు సరిదిద్దుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు కావాల్సిన వారు ఫారం- 18ని పూర్తి చేసి సమీపంలోని కూటమి కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు. ఆన్‌లైన్లో కూడా నమోదు చేసుకోవచ్చని లేదా పూర్తి చేసిన పత్రాలు తహసీల్దారు కార్యాలయంలో ఇచ్చి రసీదు పొందవచ్చని తెలిపారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని తన ప్రధాన కార్యాలయంలో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఓటు నమోదు ప్రక్రియ ఉంటుందని, అర్హులైనవారంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అద్దె బస్సులో రూ.లక్ష చీర మాయం

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలు చీర కావడంతో తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ అధికారులు

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీకి చెందిన అద్దె బస్సులో సుమారు రూ.లక్ష విలువచేసే ఖరీదైన చీర మాయమైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలను పరిశీలిస్తే.. ఈ నెల 6వ తేదీన వినుకొండకు చెందిన అద్దె బస్సు వినుకొండ నుంచి తిరుపతి వెళ్తుంది. అద్దె బస్సుకు ఒంగోలు నుంచి నెల్లూరుకు ఆర్టీసీ కార్గో ద్వారా 16 పార్శిల్స్ ఇచ్చారు. అద్దె బస్సులో పనిచేస్తున్న డ్రైవర్ 15 పార్శిల్స్‌ను కార్గోకు అందించారు. విలువైన చీరను మాత్రం ఇవ్వకపోవడాన్ని ఆలస్యంగా గుర్తించారు. ఈ చీర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలకు చెందినది కావడంతో చీర విషయం తేల్చాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు. బస్సుకు డ్రైవర్‌గా పని చేసిన వ్యక్తి ఫోన్ నంబరు నేటికీ పనిచేయకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు రైతులు సిద్ధం అవుతున్న తరుణంలో కాంప్లెక్స్ ఎరువులు కొండెక్కాయి. కాంప్లెక్స్ ఎరువుల ధర బస్తాకు రూ.100 పెరిగింది. 20:20:0:13 గతంలో రూ.1200 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1300కు చేరింది. 14:35:14 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1800కు చేరింది. 28:28:0 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1800 వరకు చేరింది. మిగిలిన ఎరువుల ధరలు యథాతథంగా ఉన్నట్లు తెలిసింది.

నడవకుండా 'మోటు'గా చంకనెక్కి..



ఈ రోజుల్లో మనుషులకంటే 'కుక్కలే' రాజభోగాలు అనుభవిస్తున్నట్లుంది. ఈ చిత్రమే అందుకు తార్కాణం. పిల్లలను చంకనేసుకున్నట్లు కుక్కని మోస్తూ కనిపిస్తున్న వ్యక్తి పేరు కోటేశ్వరరావు. ఊరు ప్రత్తిపాడు మండలంలోని కొండెపాడు. అతను ఎత్తుకున్న కుక్క పేరు మోటు. మూడు రోజులుగా జ్వరం వస్తుంటే ప్రత్తిపాడులో ఉన్న పశువుల డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్తున్నాడు. అది నడవకపోతుండటంతో ఇలా ఎత్తుకొని ఆటో కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

పొలం రాసివ్వాలంటూ బెదిరిస్తున్నారు

- 46వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ



దివ్యాంగుని నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న లోకేశ్

తాడేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ 46వ రోజుకు చేరుకుంది. సోమవారం ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో నెల రోజుల విరామం అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తిని పరిశీలించిన లోకేశ్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

కుటుంబ అవసరాల కోసం తనఖా పెట్టిన తమ 3.10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అన్యాయం చేశారని తాడేపల్లికి చెందిన జి.కృష్ణకుమారి మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. స్త్రీధనం కింద తల్లిదండ్రులు చిలువూరులోని 3.10 ఎకరాల భూమిని రాసివ్వగా ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువు నిమిత్తం ఇప్పటంకు చెందిన ఎం. మధుసూదన్‌రెడ్డి దగ్గర తాకట్టు పెట్టి కరోనా సమయంలో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించలేక పోయామన్నారు. ఇప్పుడు వడ్డీతో సహా మొత్తం చెల్లిస్తామని, తమ భూమి పత్రాలు అప్పగించాలని కోరగా భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని మధుసూదనరెడ్డి బెదిరిస్తున్నారన్నారు. తీసుకున్న అప్పునకు పొలం రాసివ్వాలంటూ పెదవడ్లపూడికి చెందిన అన్నే కృష్ణహర్ష, కృష్ణవినోద్, వైసీపీ నేత దేవినేని అవినాష్ పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని చినవడ్లపూడికి చెందిన వెనిగళ్ల వెంకటశివరావు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులతో వేధిస్తుండడంతో మానసిక వేదన అనుభవిస్తున్నామని తగు న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరారు. ఉన్నత చదవులు చదివిన తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన వి.రామకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడినైన తాను కుటుంబ పోషణ కోసం ఏదైనా చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఆర్థికసాయం చేయాలని యర్రబాలెంకు చెందిన ఎం.నాగేశ్వరరావు, కోరారు. పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి విజ్ఞప్తులివే...

వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అయిన తన భర్త గత ప్రభుత్వ అండతో టీడీపీ కూటమి నేతలపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారని, ఇదేమని ప్రశ్నించినందుకు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏలూరు జిల్లా శ్రీరామవరానికి చెందిన కామిరెడ్డి జయశ్రీ ఫిర్యాదు చేశారు. తన భర్త వెంకట నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసనపల్లిలో తన 0.92 ఎకరాలకు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని, దివ్యాంగుడినైన తాను అధికారుల తప్పిందంతో పాస్‌బుక్ కోసం పదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని చెప్పారు. మీ సేవా ఆపరేటర్లను తగిన విధంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీ సేవా ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు దివ్యాంగుల నుంచి లోకేశ్ వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే జేబీఆర్



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుతో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందనీ, ఆ జట్టులో కారంపూడి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. బాలుర విభాగంలో గెలుపొందిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును అభినందించి బహుమతులు అందించారు.

5 పాయింట్ల తేడాతో విజయం..

కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అండర్ - 14 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. బాలికల విభాగంలో ఫైనల్స్‌లో చిత్తూరు జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై గెలుపొందింది. విజేతలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తేమ సాకు.. రైతుకు షాకు

(5పేజీ తరువాయి)

గుబులుతో కోత కోయటం ఆలస్యం ధాన్యాన్ని చేను నుంచి దాటించేస్తున్నారు. అయితే ఇక్కడే తేమ శాతాలతో చిక్కు వచ్చిపడింది.

బస్తాకు రూ. 200పైన ఎదురు వసూళ్లు

రైతు పండించిన ధాన్యం అమ్మితే కొన్న వ్యాపారి కానీ, మిల్లర్లు కానీ రైతుకే డబ్బు చెల్లించటం సహజం. అయితే ఇప్పుడు పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్ముకోవాలంటే ఎదురు డబ్బు కట్టాల్సి వస్తోంది. వరి కోతలు మొదలయిన తరుణంలో ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం 75 కిలోల బస్తా ఎ గ్రేడ్ రకానికి రూ. 1740, సాధారణ రకం ధాన్యానికి రూ. 1725గా ధర నిర్ణయించింది. అదే బయట మార్కెట్‌లో అయితే యంత్రాలతో కోసిన ధాన్యానికి ఎంత తేమ ఉన్నా బస్తా రూ. 1300 నుంచి రూ. 1400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర దీనికి మించి ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే అమ్మేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నట్టే మార్కెటింగ్ శాఖ చూపిన ప్రకారం ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా బాగానే ఉన్నా, తీరా మిల్లర్ దగ్గరకు వెళ్లే సరికి రైతుకు సమస్య ఎదురవుతోంది. తేమ 17 శాతం లోపు ఉంటే మాత్రం ఏ ఇబ్బందీ పెట్టటంలేదు. సమస్యంతా తేమ ఎక్కువగా ఉండే ధాన్యానికే. 18 నుంచి 21 శాతం వరకు తేమ ఉంటుండటంతో మిల్లర్లు కొనుగోలు చేయమని చెప్పకుండా, రైతుల నుంచి ముందస్తుగానే వసూళ్లకు దిగుతున్నారు. తేమ శాతం 17 నుంచి 19 శాతం ఉంటే బస్తాకు రూ. 200 చొప్పున, 20 నుంచి 21 శాతం తేమ ఉంటే రూ. 300పైన ఎదరు కట్టాలని రైతుల నుంచి నిలబెట్టి వసూలు చేస్తున్నారని, చెబుతున్నారు.

బస్తాకు రూ. 200 నుంచి రూ. 300 ఎదురు కట్టాల్సి రావటం ఇబ్బదిగా ఉందని, అదే ప్రభుత్వమే రేటులో కోత విధిస్తే, మిల్లర్లకు ఎదురు కట్టే పరిస్థితి ఉండదని, పైగా వారు మద్దతు ధరలో కోత కోసి దోపిడీ చేయకుండా తెరపడుతుందని, రైతులకు మేలు జరుగుతుందనేది రైతుల మాట. 75 కిలోల బస్తాకు ఎంత తేమ ఉంటే ఎంత తరుగుదల ఉంటుందనే అంశాన్ని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో నిర్ణయించి రేటు నిర్ణయిస్తే చాలావరకు మేలు జరుగుతుంది. రైతుల నిలువుదోపిడీ లేకుండా పోతుంది. త్వరలో రైతు సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై మరోసారి పునరాలోచించాలనేది రైతుల విన్నపం.

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రసన్న వెంకటేష్, అరుణ్ బాబు

సత్తెనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. పల్నాడు జిల్లా రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బాలుర పాఠశాల ప్రిన్సిపల్ జాన్‌సన్, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ అధ్యక్షత వహించారు. సభలో ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మేధాశక్తికి, పేదరికానికి సంబంధం లేదన్నారు. చాలా మంది మేధావులు గురుకులాల్లో విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కొనసాగుతున్నారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను గుర్తించి వారిని ప్రోత్సహించి భావి తరాలకు మంచి శాస్త్రవేత్తలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను గుర్తించి వారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించటానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం ప్రసన్న వెంకటేష్, అరుణ్ బాబు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు విద్యార్థులచే ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 190 గురుకుల పాఠశాలల విద్యార్థులు 160 మంది తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, జోనల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదేళ్లు విద్యా వ్యవస్థతో ఆడుకున్నారు

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ. నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు అధికారాన్ని అడ్డం పెట్టుకొని విద్యా వ్యవస్థతో చెడుగుడు ఆడుకుని, ఇప్పుడు మొసలి కన్నీరు కార్చుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 5 ఏళ్లలో రాష్ట్రాన్ని యాభై ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లిన జగన్ అరాచకాలకు ముందుగా బలి అయింది విద్యావ్యవస్థేనని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పాఠశాల విద్యలో సమస్యలు అంటూ జగన్ రాద్ధాంతం చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. దిగిపోయే నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,480 కోట్లు పెట్టి, ఇప్పుడు వాటి పేరు చెప్పి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం ఏమిటని ప్రశ్నించారు. అమ్మఒడి ఆగిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇటీవల బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి రూ. 6487 కోట్లు కేటాయించిది కనిపించలేదా అని ప్రశ్నించారు. జగన్ రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పుల్లో పెట్టి పోయారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అందరూ అభినందిస్తుంటే జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అనుకున్న భార్యభర్తల మధ్య వీసా నిరాకరణతో కాపురంలో కలహాలు చెలరేగి భర్త ఇంటి ముందు భార్య నిరసన దీక్షకు దిగిన సంఘటన పొన్నూరు మండలం ఆరెమండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కట్టెంపూడి గ్రామానికి చెందిన గొపిశెట్టి మౌలిక అనే యువతికి ఆరెమండ గ్రామానికి చెందిన గరిగంటి మొగలాయి బాబుకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఎంబీఏ చదువుకున్న మౌలిక ఆస్ట్రేలియాలో స్థిరపడాలని, ఆమె ద్వారా భర్త కూడా ఆస్ట్రేలియా వెళ్లాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మౌలికకు రెండు సార్లు వీసా నిరాకరణకు గురైంది. విదేశాల్లో ఉద్యోగాన్వేషణ విఫలం కావడంతో అత్తింటి వారి నుంచి వేధింపులు ప్రారంభమైనట్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల మొగలాయి బాబు తన భార్య మౌలికకు సంబంధించిన దుస్తులు, సామగ్రి పుట్టింటికి పంపించివేయటంతో అనుమానం వచ్చిన మౌలిక కుటుంబ సభ్యులు మొగలాయి బాబును నిలదీశారు. ఈ వివాదం చెలరేగటంతో మౌలిక తన భర్తను నిలదీయటానికి ఆరెమండ వెళ్లగా మొగలాయి బాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు మౌలిక ఆరోపించింది. భర్త ఇంటి ముందే టెంట్ వేసి కుటుంబ సభ్యుల సహకారంతో నిరసనకు దిగింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మౌలికకు చెప్పారు. అయితే ఫిర్యాదు చేయడానికి నిరాకరించినట్లు తెలిసింది.

రేపు యూపీఎస్సీ ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

గుంటూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఇందుకు అర్హులైన అభ్యర్థుల్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు గుంటూరు రాజాగారితోటలో బీసీ స్టడీ సర్కిల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

నేడు మంజులారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం



రెంటచింతల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన చేేరెడ్డి మంజులారెడ్డిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించిన విషయం విదితమే. ఆమె మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. పదవీ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్

పిట్టలవానిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతెనవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజన వాడ కాలనీకి చెందిన కర్లపూడి రాజశేఖర్ ఈ నెల 22న హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన అత్త వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని రూ.40 వేలు విలువ చేసే గృహోపకరణాలను చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందోలు పోలీసుస్టేషన్‌లో ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ముగ్గురు నిందితులైన తెనాలికి చెందిన గుంజి శ్రీను, కట్టా వెంకటేశ్వర్లు, పొన్నూరుకు చెందిన దేవరకొండ కృపరాజులను అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్య



మేడా రామిరెడ్డి (ఫైల్)

దాచేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలురైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మేడా రామిరెడ్డి (45) గత నాలుగేళ్లుగా పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నాడు. పండిన పంటలకు పెట్టుబడి కూడా రాకపోవడంతో సుమారు రూ. 15 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఈ ఏడాది కూడా పత్తిపంటను సాగు చేశాడు. పంట దిగుబడి సరిగా లేకపోవడం, తీసుకున్న అప్పులు పెరగడంతో మూడు రోజుల క్రితం నివాస గృహంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు గ్రామంలో ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన చికిత్సకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య వెంకట నరసమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

28,265 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 32,556 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 28,265 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 33,392 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8000	14000
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	--	--
273	8500	11500	273	--	--
341	8000	14500	341	9000	13000
4884	-	-	4884	9000	13500
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500	తేజ	9000	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	9500	12500
దేవనూరు డీలక్స్	9000	15700	దేవనూరు డీలక్స్	11500	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మాచర్ల విద్యుత్ శాఖ డీఈగా సింగయ్య

మాచర్లటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల విద్యుత్ శాఖ డీఈగా నూతల పాటి సింగయ్య నియమితులు కాగా, సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు నుంచి బదిలీపై మాచర్లకు వచ్చారు. ఇప్పటి వరకు నరసరావు పేట డీఈ రాంబంట్లు మాచర్ల ఇన్‌చార్జి డీఈగా వ్యవహరించారు.

జోన్ డైరీ

● కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రవిబాబు క్రోసూరులో ప్రజలకు పిలుపు నిచ్చారు.

● పెదకూరపాడు మండలానికి చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఉదయం 10 గంటలకు మంగళగిరిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో విద్యుత్ వినియోగ దారుల పరిష్కార వేదిక అవగాహన కార్యక్రమం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నత్తనడకన జలజీవన్‌మిషన్ పనులు

● అంచనా వ్యయం రూ. 72.96 కోట్లకుపైనే
● ఖర్చు చేసింది రూ.9.66 కోట్లు మాత్రమే
● ఆరు నెలలుగా కుంటుపడిన పనులు

పిడుగురాళ్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకం కింద గురజాల నియోజకవర్గంలో ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా గత ఆరు నెలల క్రితం వరకు పూర్తిచేసిన 9.66 కోట్ల రూపాయల పనులకు సంబంధించి బిల్లులు జమ చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనుల్లో వేగం మందగించింది. పిడుగురాళ్లలో 36, మాచవరంలో 19, దాచేపల్లిలో 27, గురజాలలో 18తో కలిపి మొత్తం 100 వర్క్‌లకు గాను 72 కోట్ల 96 లక్షల 84 వేల రూపాయలు మంజూరయ్యాయి.

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జలజీవన్ మిషన్ పనుల కొనసాగింపులో సందిగ్ధత ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ పాలనలో కొంద రు కాంట్రాక్టర్లు ఆ పార్టీ నేతలతో అంటకాగి టెండర్లను దక్కించుకున్నా, పనుల్లో నాణ్యతకు తిలోద కాలిచ్చారన్న ఆరోపణలు రావడంతో ఆ పనులు ఇంకా వారి చేతనే చేయించాలా? లేక కొత్తవారితో చేయించాలా అన్న సందేహంలో ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఉన్నతాధికారులు ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది. గురజాల నియోజక వర్గంలో పట్టణ ప్రాంతాలు కాక మిగిలిన గ్రామీణ ప్రాంతాలలో మంజూరైన 100 పనులకు సంబంధించి ఇంకా 12 పనులు ప్రారంభించకపోగా మరో 28 పను లు జరుగుతున్నాయి. 17పనులు మాత్రమే పూర్తిచేసి నట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నారు.



గామాలపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్న సిబ్బంది (ఫైల్)

పథకం పూర్తయితే నీటి కలుషితానికి చెక్..

జలజీవన్ మిషన్ పథకం పనులన్నీ పూర్తయితే నీటి కలుషితానికి చెక్ పడినట్లే. ఇప్పటిదాకా గ్రామీణ ప్రాంతాలలో నీటి పైపులు మురుగు కాల్వల్లో, వ్యర్థాల మధ్య వుండటంతో ఎక్కడో ఒకచోట లీకేజి ఏర్పడి నీరు కలుషితమై ప్రజలు డయేరియా బారిన పడుతున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనులకు సంబంధించి జింక్ పైపులైన్లు వాడటంతో పాటు రోడ్డుపైనే పైపులు వుండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎక్కడా కూడా మురుగు కాల్వలు వుండకుండా, లీకేజి సమస్య ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

> ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గురజాల నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాల్లో మొదలైన జల్‌జీవన్‌మిషన్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్ల క్రితమే 72.96 కోట్లకు పైగా నిధులు మంజూరు కాగా. అప్పటి వైసీపీ ప్రభుత్వం పాలనలో పనుల్లో పురోగతి లేకుండా పోయింది.

పనులు వేగవంతమయ్యేలా చూస్తా
- వెంకటేశ్వర్లు, డీఈ



నియోజకవర్గ పరిధిలో జలజీవన్ మిషన్ పథకం పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాము. కొద్దికాలంగా పనులు ఆలస్యంగా జరుగుతు న్నాయి. నేను కొద్ది రోజుల క్రితమే ఇక్కడికి బదిలీపై వచ్చాను. ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగవంతం అయ్యేలా చూస్తా.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారులు

క్రోసూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని పలు ఎరువుల దుకాణాల్లో సోమ వారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏడీఏ సీహెచ్.రవికుమార్ ఆధ్వర్యంలో వ్యవసా యశాఖ ప్రత్యేక అధికారులు తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సోర్స్ ఆఫ్ సప్లయ్ ఎరువుల లైసెన్స్‌లలో నమోదు కాని ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ తనిఖీల్లో రూ.12 వేలు విలువ చేసే రెండు టన్నుల ఎరువులను అమ్మకాలను నిలిపి వేసినట్టు తెలిపారు. షాపులడీలర్లు సోర్స్ సర్టిఫికెట్ లైసెన్స్‌లో పేర్కొన్న ఎరువులను మాత్రమే విక్ర యించాలని, ప్రతిరోజు షాపుల్లో ఎరువుల నిల్వ లను, ధరలను సూచించే బోర్డులు నవరించాలని, రైతులు కొనుగోలుచేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. క్రోసూరులోని శ్రీసాయి వెంకటలక్ష్మి ఫెర్టిలై జర్స్, వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్, జయశంకర్ ఏజెన్సీస్‌షాపుల్లో చేపట్టిన తనిఖీల్లో క్రోసూరు ఏడీఏ వీ.హనుమంతరావు, వ్యవసాయ అధికారి వీ.వేణుగోపాల్ పాల్గొన్నారు.



దాచేపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెదగార్లపాడు గ్రామస్థులు

భారీ బ్లాస్టింగ్‌ల నుంచి కాపాడండి

● పెదగార్లపాడు గ్రామస్థుల ఆందోళన.. గ్రీవెన్స్‌లో కలెక్టరుకి వినతి

దాచేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ బ్లాస్టింగ్‌లతో భూగర్భజలాలు కలుషితం కావడం, బోరులో నీరు రంగు, రుచి, వాసన మారి అంటురోగాలు ప్రభలడం, శారీరక నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలతో పాటు, ఇళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయని దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామస్థులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం కలెక్టరు గ్రీవెన్స్‌కు హాజరై ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో వున్న చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ, గ్రామంలోని బ్రహ్మంగారిగుడి, బీసీ కాలనీని ఆనుకొని వున్న క్వారీలలో హెవీ బ్లాస్టింగ్ చేస్తున్నారని, దీంతో గ్రామంలోని మంచినీటి బోర్లు దెబ్బతింటున్నాయని, ఆనీటిని తాగటంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పశువులు కూడా పలు వ్యాధులకు గురవుతున్నాయ న్నారు. బ్లాస్టింగ్‌లతో రాత్రివేళ నిద్రపోవాలంటే భయంగా వుందని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం హెవీ బ్లాస్టింగ్‌లను ఆపాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పురంశెట్టి పరంజ్యోతి, కోరె రామారావు, టీడీపీ నేతలు బెల్లంకొండ భద్రి, వేముల తిరుమలకుమార్, నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, మామిడి చంద్రశేఖరరావు, ఐనాల శ్రీరాములు, పాల్గొన్నారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు.

పెట్రోలు బంకు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

వెల్దుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోలు బంకు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, దిర్శినాల శ్రీనివాసరెడ్డి, యాకోబు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో గురజాల ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భం గా పాస్టర్లు పలు సమస్యలను పరిష్కరించా లని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో పాస్టర్స్ విన్నయ్య, వర్ల ఆదాం, జయప్రకాష్, దేవదాసు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

కారంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రూ. 2 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారు లకు అందజేశారు. మిర్యాల గ్రామానికి చెందిన గంటనపల్ల పుల్లయ్యకు రూ. 1.32 లక్షలు, నాగెండ్ల నాగేశ్వరరావుకు రూ. 37 వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్ర మంలో సర్పంచ్ సరస్వతి, బాలునాయక్, పీ.అంజయ్య టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 27 మంది లబ్ధిదారులకు రూ. 34 లక్షల విలువైన చెక్కు లను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అందజేశారు.

పైపులైను లీకేజీకి మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెంటచింతల,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మంచినీటి పైపు లైను లీక్' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురి తమైన వార్తపై రెంటచింతల పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఏడు మంగళం వాగు వద్ద వున్న లీకైన పైపు లైనుకి సోమవారం మరమ్మతులు చేసి నీరు వృథా గాకుండా చర్యలు తీసుకున్నారు.

అరాచకాన్ని పారదోలి అభివృద్ధి వైపు..

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● టీడీపీ సభ్యత్వ నమోదుపై నేతలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనను పారదోలి రాష్ట్రం, గురజాల అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నియోజకవర్గస్థాయి పార్టీ ముఖ్యులు, శ్రేణులతో టీడీపీ సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వాన్ని ప్రతి కార్యకర్త సీరియస్‌గా తీసుకో వాలని, మండల గ్రామాలవారీగా లక్ష్యాలను పూర్తిచే యాలని సూచించారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే లింకురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతా మన్నారు. త్వరలో సొసైటీ, నీటిసంఘాల ఎన్నికలు, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి అమెరికా దాకా పాకిందన్నారు. తల్లి, చెల్లిపై కూడా వదలకుండా వైసీపీ సోషల్ మీడియా అసభ్యకర పోస్టులు పెట్టినా జగన్ నోరెత్తి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు..

గురజాల నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్క్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారని, దీనిద్వారా పల్నాడులోని యువతకు ఉద్యోగ అవకా శాలు వస్తాయన్నారు. డిసెంబరులో జాబ్‌మేళా నిర్వ హించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. జంగాకృష్ణమూర్తి మూడోసారి టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఎంపిక కావడం అభినందనీయమ న్నారు. సమావేశంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జున రావు, బాబావలి, జడ్పీటీసీ వెంకటకోటయ్య, వినోద్‌రెడ్డి, చెన్నారావు, హసన్ అహ్మద్, శ్రీను, భద్రి, వెంకటేశ్వర్లు, సాంబశివరావు,లక్ష్మీనారాయణ, సురేష్, వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలి తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ముగిసిన కార్తీకమాస పూజలు

మాచవరం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాల శివాలయాల్లో కార్తీక మాస పూజలు సోమవారంతో ముగిశాయి. మోర్జంపాడు శివా రు బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం, పిల్లుట్ల, మల్లవోలు, మాచవరం, వేమవరం, పిన్నెల్లి తదితర ఆలయాల్లో మహిళలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బుగ్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉడతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం చివరి రోజున పట్టణంలోని అచ్చంపేటరోడ్డు పక్కనగల శివాల యంలో భక్తులు పూజలు చేశారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలేశ్వర పాలెం గ్రామ శివారులో వేంచేసివున్న నీలకంఠేశ్వర స్వామి వారి చల తిరునాళ్ళ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో వేలాది మంది భక్తులు విరివిగా విచ్చేసి స్వయంభూగా వెలసిన స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

పాఠశాలలో డీఈవో తనిఖీ

సత్తెనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ సోమ వారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. తరగతి గదులు, భవనాలను పరిశీలిం చారు. సిమ్స్‌యాప్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఉద్దేశించి ఉపాధ్యాయులకు వంద శాతం హాజరు ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయినిను ఆదేశించారు. తరగతులకు ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని తరగతులకు రప్పించేందుకు ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయిని బాలికల తల్లిదండ్రులకు అవగా హన కల్పించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం డీవైఈవో కార్యాలయంలోని రికార్డులను తనిఖీచేసి పలు సూచ నలు చేశారు. అనంతరం నాగన్నకుంట ప్రాంతంలో పర్యటించి బడిబయట వున్న నలుగురి విద్యార్థినుల గృహాలను సందర్శించి వారిని బడిలో చేర్పించారు.



ఇన్ఫెక్షన్ సోకిన కాలి గాయంతో గోవిందు, పక్కన గోవిందు భార్య రమణ

బతుకు భారమై భిక్షాటన

● అర్హత ఉన్నా అందని పింఛన్.. పట్టించుకోని అధికారులు.. నేతలు
● వృద్ధాప్యంలో అష్టకష్టాలు పడుతున్న దంపతులు

గురజాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):గురజాల పట్టణంలోని నాయుడు సెంటర్‌లో బొప్పూరి గోవిందు, రమణ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుం టూ జీవనం సాగిస్తున్నారు. వీరిది కడు పేద కుటుంబం. వీరికి ఓ కుమార్తె సంతానం కాగా, పదేళ్ల ప్రాయం వచ్చే సరికి అనారోగ్యంతో మృతి చెందింది. 2020 నాటికి గోవిందుకు 61 ఏళ్లు నిండడంతో గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరైంది. సరిగ్గా మూడు నెలలు మాత్రం పింఛన్ అందింది. అనంతరం ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉందని సాకు చూపి పింఛన్‌ను నిలిపి వేశారు. పింఛన్ పునరుద్ధరణ కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం మాత్రం లేదు. ఈక్రమంలో గోవిందు షుగర్ వ్యాధికి గురయ్యాడు. కాలికి గాయమై ఏపని చేయలేని పరిస్థితి ఏర్పడింది. పూట గడవడం కష్టమవ డంతో చివరకు బతకు భారమై సొంత ఊరిలోనే బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషించకుంటున్నాడు. గోవిందు భార్య రమణ కూలీ పనులకు పోతూ భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వసత్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గోవిందుకు పింఛన్ అందజేయాలని, అలాగే ఆ కుటుం బానికి ఆర్థిక చేయూతనివ్వాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఇష్టంతో పనిచేద్దాం

● సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనమంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలని, అప్పుడే ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావే శంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్ట్ పల్నాడు ప్రజల దశాబ్దాల కలగా మిగిలిందని, ఆ కలను సాకారం చేసి సాగు, తాగు నీటిని అందించి ప్రజల రుణం తీర్చుకుంటామ న్నారు. డొక్కా సీతమ్మ పథకం మధ్యాహ్న భోజనంలో చిన్నసైజు గుడ్లు వస్తున్నాయని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో అవినీతికి పాల్పడితే సహించేది లేద న్నారు. వైసీపీ హయాంలో ఆక్రమణలకు గురైన ప్రభు త్వ భూములను గుర్తించి స్వాధీనంచేసుకోవాలని తహ సీల్దార్ ఫణీంద్రకుమార్‌కు సూచించారు. ముందుగా పోలేపల్లిలో శివాలయంనిర్మాణానికి భూమిపూజచేశా రు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, ఎంపీడీవో శివకుమార్, సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, లింగా రమేష్, శ్రీనివాసరావు, హరి, చెన్నయ్య, ఎలీషాబాబు, కోటేశ్వరరావు, నారయ్య, దాసు, పుల్లయ్య, కృష్ణ, రవి, మహేష్, అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణకమిటీ

అమరావతి, నవంబరు25: మండల పరిధిలోని పలు గ్రామాల డ్వాక్రా సంఘాల్లో నగదు చెల్లింపు విషయంలో జరిగిన అక్రమా లపై విచారణ కోసం డీఆర్డీఏ పీడీ బాలునాయక్ మూడు కమిటీలను నియమించారు. స్త్రీనిధి హెడ్ ఆఫీసు నుంచి ఏజీఎం కే. చెన్నకేశవులు, డీపీఎం పీ.చిన్న శ్రీనివాసులు, డీపీఎం. ఎం. హనుమానాయక్ పర్యవేక్షణలో ఆయా మండలాలకు చెందిన ఏడుగురు సీసీలు ఈ కమిటీలో ఉన్నారు. సోమవారం ఈ కమిటీ ధరణికోట గ్రామంలో బాధిత మహిళలను విచారించింది. వీరితో ఏపీఎం కృష్ణప్రియ, మండల సమాఖ్య కార్యవర్గం ఉన్నారు.

..రూ.5లక్షల ప్రమాద బీమా

ముప్పాళ్ళ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకోవటం ద్వారా సభ్యుడి కుటుంబానికి రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని దమ్మాలపాడులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నేతలు శిరిగిరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాషామృతి పార్టీకి తీరనిలోటు

బెల్లంకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు బాషా మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ అన్నారు. సోమవారం మండల కేంద్ర మైన బెల్లంకొండలో బాషా మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి బాషా కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి బాషా మృతికి సంతాపం తెలిపారు. బాషా కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిస్తూ సానుభూతి వ్యక్తం చేశారు.

టీడీపీ మైనార్టీల ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ మైనార్టీల ఆత్మీయ సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు సోమవారం పట్టణంలో నిర్వహించారు. టీడీపీ నేత, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొని సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి, టీడీపీ నేతలు సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జానీ బాబు, సయ్యద్ మాబూ, రాంబో బుడే, జానీ బాషా, అబ్దుల్ నబీ, మస్తాన్‌వలి, దూదేకే, జాకీర్, సైదా, మహమ్మద్, గౌస్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల డీలర్‌షిప్‌కి దరఖాస్తులు ఆహ్వానం

దాచేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం లోని పలు గ్రామాల్లో నూతన రేషన్‌షాపుల ఏర్పాటుకు దరఖా స్తులు కోరుతున్నట్లు దాచేపల్లి తహసీల్దారు వైపీ కుటుంబరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పెదగార్ల పాడు, నడికూడి-2, రామాపురం, మాదినపాడు, ముత్యాలంపాడు గ్రామాలలో నూతన రేషన్ షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తుల ఆఖరు తేదీ డిసెంబరు 4 కాగా, 8వ తేది రాత పరీక్ష, 10వ తేది మౌఖిక పరీక్ష ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారుని వయస్సు 18 నుంచి 40 ఏళ్ల లోపు వుండాలన్నారు. దరఖాస్తుతో పాటు నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డుల జిరాక్స్‌లను దాచేపల్లిలోని తహ సీల్దారు కార్యాలయంలో డిసెంబరు 4వ తేదీలోగా అందజే యాలని తహసీల్దారు కోరారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు రేషన్ దుకాణా ల డీలర్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తహసీల్దారు ఫణీంద్రకుమార్ తెలిపారు. మండలంలోని అడిగొప్పులకు 2, ఒబులేశునిపల్లె 1, కోలగుట్ల 1, కాకిరాల 1, కంచరగుంట 1, దుర్గి 1 రేషన్‌షాపు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం సూచించిన ధ్రువీకరణ పత్రాలను డిసెంబరు 4 తేదిలోగా ఫోటోలతో గుర జాల ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని తహ సీల్దార్ ఫణీంద్రకుమార్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్తిమళ్ల రమేష్, పాల్గొన్న టీడీపీ నేతలు

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదులో పెదకూరపాడు ముందంజ

పెదకూరపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ శాశ్విత సభ్యత్వ నమోదులో పెదకూరపాడు నియోజకవర్గం ముందంజలో ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్ అన్నారు. సోమవారం పెదకూరపాడులో టీడీపీ సభ్యత్వ నమోదు శిబిరంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి మండలంలో ఏడుగురు, అచ్చం పేట మండలంలో ఇద్దరు, క్రోసూరు మండలంలో ఇద్దరు, బెల్లంకొండ మండలంలో ఒకరు మొత్తంగా 14 మంది శాశ్వత సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. సమావేశంలో మండల టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

పెదకూరపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నే రావూరి ప్రసాదు అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆయన భౌతికకాయాన్ని రమేష్ సందర్శించి నివాళులర్పించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తెనపల్లి బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... షేక్ కరీముల్లా గౌస్ గారి భార్య షేక్ బాజీ బీ గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. [illegible]

లంకా విజయకుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, [illegible] సెల్ నెం.9030595227, 9848052914.

బహిరంగ ప్రకటన

[illegible]

లంకా విజయకుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 22 లైన్, [illegible] గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.



ప్రకృతి వరి.. నో వర్రీ

- గింజ పాలు దశలో పడిపోకుండా ఉన్న పైరు
- గుంటూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ వరి సాగు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- పరిశీలన కోసం తెలంగాణ నుంచి వచ్చిన రైతులు


పడిపోకుండా ఉన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట


పూర్తిగా పడిపోయిన రసాయన ఎరువులు వాడిన వరి పంట

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతికి పుడమి కూడా పులకరిస్తుంది. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడకపోవటం వల్ల భూమి కూడా కర్షకులకు సహకరిస్తుంది. గుంటూరు జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూతన అధ్యాయానికి నాంది పలికింది. తుపానును సైతం తట్టుకొని నిలబడిన ప్రకృతి వ్యవసాయ వరి పంట ఇప్పుడు మరో రికార్డు సృష్టించింది. గింజ పాలు పోసుకునే దశలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడిన వరి పంట పూర్తిగా పడిపోగా, ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో పంట ఏపుగా నిలబడి ఉండటం చూసి రైతులు, వ్యవసాయ అధికారులు ఆశ్చర్య పోతున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పైరు కీలకమైన దశలో నిలబడి ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటిం చారు. ఈ పంటను చూసేందుకు పక్క రాష్ట్రాల నుంచి రైతులు వందల సంఖ్యలో వచ్చిపోతున్నారు.

పెట్టుబడి తక్కువే...

ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగుచేశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పంటలకు ఎకరాకు సుమారు రూ. 26 వేల నుంచి రూ.30 వేల వరకు (కోత కూలీ కలుపుకుని) పెట్టుబడి గా పెట్టారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో సాగు చేసిన పొలాల్లో పెట్టుబడి సాధారణ పొలాల తో పోల్స్తే ఎకరాకు రూ.10 వేల వరకు తగింది. విత్తనాలు కూడా తక్కువగా నే వాడినట్లు రైతులు చెబుతున్నారు.

కీలక దశలో పడిపోయిన పైరు

ప్రస్తుతం చాలా చోట్ల వరి కోత దశకు చేరింది. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో భూమిలో పటుత్వం తగ్గి గింజ పాలు పోసుకొని ముగ్గే దశలో వరి పైరు పడిపోయింది. ఈ పొలాల్లో ఖరీఫ్ లో ఎకరాకు రెండు బస్తాల డీఏపీ, ఒక బస్తా కాంప్లెక్స్ ఎరువులు, మూడు బస్తాలు యూరియా వాడినట్లు రైతులు చెబుతున్నారు. అదీకాక రబీలో మొక్క జొన్న, జొన్న సాగు సందర్భంగా ఇబ్బడిముబ్బడిగా ఎకరాకు 10 బస్తాలకు తగ్గకుండా యూరియా వాడినట్లు గుర్తించారు. దాని ప్రభావం వల్ల వరి కీలకమైన దశలో పంట పూర్తిగా నేల మీద పడిపోయింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న పొలాల్లో ఎరువుల వాడకం పూర్తిగా ఆపివేయడంతో నేల పటుత్వంతో ఉండి గింజ పాలు పోసుకునే దశలో కంకులు నిలబడి ఉన్నాయి.

పైరు పడిపోతే చాలా నష్టం...

వరి పంట పడిపోవడం వల్ల రైతులకు అపార నష్టం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పడిపోవడం వల్ల విత్తనాలు పాలుపోసుకోక తాలు గింజలు తయారు కావటం, పూర్తిగా మగ్గక పోవటం, అరగింజలు, విరిగిన గింజలు తయారు కావటం జరుగుతుందని చెబుతున్నారు. వీటి ప్రభావం వల్ల పంట దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. ఇంత నష్టం వరి సాగు చేసిన చివరి 20 నుంచి 25 రోజుల్లో జరుగుతుంది. ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన వరికి ఈ ప్రమాదం లేదు. కంకులు ఏపుగా నిలబడి ఉండటం వల్ల గింజ పాలు పోసుకుని, ముగ్గే దశలో మేలు జరుగుతుంది. తద్వారా దిగుబడి కూడా పెరుగుతుంది.

తరలి వచ్చిన తెలంగాణ రైతులు..

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి చివరి దశను పరిశీలించేందుకు సోమవారం తెలంగాణ రైతులు జిల్లాకు వచ్చారు. వేజెండ్ల, అత్తోట, కొల్లిపొర మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరును సాగు చేశారు. ఒకే చోట రసాయనిక ఎరువులు వాడిన పంటకు,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటకు మధ్య ఉన్న తేడాను అధికారులు తెలంగాణ రైతులకు చూపించారు.



మాకే ఆశ్చర్యం వేసింది

రాజకుమారి, జిల్లా మేనేజర్, ప్రకృతి వ్యవసాయం



జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట పడిపోకుండా నిలబడి ఉంది. తుఫాను సమయంలో కూడా అంత వరద లోనూ తట్టుకొని వెంటనే తిప్పుకుంది. పంట సంరక్షణ కోసం రైతులు మేము సూచించిన కషాయాలు మాత్రమే వాడారు. ఇప్పుడు వాళ్ళ కళ్ళలో ఆనందం కనిపిసున్నది. రెండు పొలాల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంటే మాకే ఆశ్చర్యం వేస్తుంది.

ప్రకృతి పద్ధతే మంచిది

నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం రైతులకు అన్ని రకాలుగా మంచిది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమి తో పాటు,పర్యావరణం పాడవుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి చక్కగా నిలబడి ఉంది. ఈ సంవత్సరం ఆ రైతులకు మంచి దిగుబడి కూడా వచ్చే అవకాశం ఉంది.

ఏఎన్‌యూలో నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దక్షిణ, పశ్చిమ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పాల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాల్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలు మహిళలకు ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు, పురుషులకు ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫర్టులు ఈ పోటీలలో పాల్గొంటారని వివరించారు. పోటీలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మీ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య హాజరుకానున్నారు.

సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ జె.వెంకట మురళి


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జె. వెంకటమురళి సూచించారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి డిసెంబరు 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని తెలిపారు. అధికారిక సమాచారం వచ్చినందున అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులు, మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా సమగ్రప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ఆయాశాఖల అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. సీఎం పర్యటనకు 10 రోజులు గడువు ఉన్నందున మంచి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

రహదారులకు మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

తెనాలి రోడ్డు దుగ్గిరాల వద్ద, చిలకలూరిపేట- పెదనందిపాడు రోడ్డు, వట్టిచెరుకూరు- పాంద్రపాడు, యర్రగుంట్లపాలెం- తుళ్లూరు, కాజ- ఉప్పలపాడు, గుంటూరు- హనుమాన్‌పాలెం, తెనాలి నారా కోడూరు రోడ్లను నిర్మించనున్నారు.

పల్నాడు జిల్లాకు..

పల్నాడు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం భారీగా నిధులు కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతుల నిమిత్తం 4.86 కోట్లు కేటాయించారు. అత్యధికంగా గుర జాల నియోజకవర్గానికి 1.12 కోట్లు కేటాయించగా, చిలకలూరిపేటకు 93.7 లక్షలు, నరసరావుపేటకు 89.6 లక్షలు, మాచర్లకు 85 కోట్లు చొప్పున కేటాయించారు. వీటితోపాటు అత్యవసర మరమ్మతుల కింద 567.8 కిలో మీటర్ల రహదారుల్లో 82 పనులకు మొత్తం 22.44 కోట్లు కేటాయించారు. వీటిలో 72 మరమ్మతులకుగానూ 3.44 కోట్లు, 371 కి.మీ మేర ప్యాచ్ వర్కుల నిమిత్తం 11.57 కోట్లు, రోడ్డు అంచుల ప్యాచ్ వర్కుల కోసం 94.5 లక్షలు, కంపచెట్ల తొలగింపు కోసం 91.7 లక్షలు, వర్షపు నీటికి దెబ్బతిన్న రోడ్లకు 4.15 కోట్లు కేటాయించారు. ప్రధానంగా రొంపిచర్ల, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, పెదకూరపాడు, సత్తెన పల్లి, నరసరావుపేట, వినుకొండ, శావల్యాపురం, కారంపూడి, గురజాల, పిడుగురాళ్ల, క్రోసూరులలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

బాపట్ల జిల్లాకు రూ. 72.5 కోట్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల- రేపల్లె సబ్ డివిజన్లో 217 కి.మీ మేర రాష్ట్ర రహదారులు, 599.6 కి.మీ మేర జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జిల్లా రహదారుల మరమ్మతులకు సంబంధించి కోటిన్నర రూపాయలతో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. కేంద్ర రహదారుల నిధుల కింద రూ. 36.31 కోట్లతో 60.35 కి.మీ మేర రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 8.91 కోట్లతో 5.97 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తున్నారు. వాటితోపాటు రేపల్లె- నిజాంపట్నం మధ్య రెండు చోట్ల పైప్ కల్వర్టులు, గుంటూరు చీరాల మధ్య మరో కల్వర్టు నిర్మిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో కట్రపాడు- శంకరపురం రోడ్డు, రావినూతల రోడ్డు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డు, పర్చూరు వంకాయలపాడు- కొడవలివారిపాలెం రోడ్డు, చీరాల- దగ్గుబాడు రోడ్డు, గర్నెపూడి- తిక్కరాజు పాలెం, నూతలపాడు- కారంచేడు, కారంచేడు- ఇంకొల్లు, పందిళ్లపల్లి- కడవకుదురు, వేటపాలెం, సంతరావూరు, జాండ్రపేట- వేటపాలెం, పర్చూరు- ఇంకొల్లు, వేమూరులో వెల్లటూరు- జువ్వలపాలెం, గాజుల్లంక- చింతమోటు, చినపులివర్రు- రావికంపాడు, తెనాలి- వెల్లటూరు, బాపట్లలో ఖాజీపాలెం- బుద్దం మొత్తం 22 పనులకు రూ. 1.15కోట్లు కేటాయించారు. వీటితోపాటు 14 చోట్ల జంగిల్ క్లియరెన్సు పనుల నిమిత్తం 71.28 లక్షలు కేటాయించారు.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు

- అమరావతికి పంచారామాల భక్తులు
- కోటప్పకొండకు వేలాదిగా భక్తులు
- పెదకాకాని శివయ్య సన్నిధిలో శివనామస్మరణ
- సూర్యలంక సముద్ర తీరంలో పుణ్యస్నానాలు

కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని భక్తజనంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు పులకించాయి. ప్రముఖంగా గుంటూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని అమరావతి అమరేశ్వరాలయం, కోటప్పకొండపైనున్న త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక సాగర తీరంలో భక్తులు కార్తీక మాస పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి.


అమరావతి : కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

అమరావతి, నరసరావుపేట, పెదకాకాని, బాపట్ల రూరల్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి) అమరావతిలోని అమరేశ్వర ఆలయానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే వివిధ ప్రాంతాల నుంచి పంచారామ పుణ్యక్షేత్రాలు దర్శించే భక్తులు చేరుకున్నారు. సోమవారం తెల్లవారు జామున 3గంటల నుంచి పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించారు. అనంతరం కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం వరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తూనే ఉన్నారు. సాయంత్రం స్వర్ణయుగ సేవాట్రస్టు చైర్మన్ దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం జరిగింది. భక్తులకు ఏర్పాట్లను ఈవో పీ. సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. డీఎస్పీ ఎం. హనుమంతరావు పలువురు పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురష్కరించుకొని త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. విశేష పుష్పాలకంరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో.. నందీశ్వరుని విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. అలయ ఈవో డీ.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

మల్లేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానములో వేకువజామునుంచే భక్తులు బారుతు తీరారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధన పూజలు చేశారు. పలువురు భక్తులు కళ్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళం, వస్త్రాల బహిరంగ వేలం ద్వారా రూ. 10.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఉపకమిషనరు కేబీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయంలో మల్లేశ్వరస్వామి వారికి లక్షబిల్వార్చన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ ఉప కమిషనరు కోరారు.


పెదకాకాని శివాలయంలో క్యూలో బారులు తీరిన భక్తులు


సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు

సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు

బాపట్ల మండలం సూర్యలంక తీరం భక్తులతో పోటెత్తింది. అధిక సంఖ్యలో సందర్శకులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున మహిళలు కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం సముద్రదేవునికి తాంబూలం సమర్పించి కార్తీకదీపాలను సముద్రనీటిలో వదిలారు. సమీపంలోని శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం, బాపట్లలోని శివాలయాలకు భక్తులు తరలి వెళ్ళి ప్రత్యేక పూజలను నిర్వహించుకున్నారు. తీరంలో పర్యాటకులు అధిక సంఖ్యలో రావటంతో బాపట్లరూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సాహస జీవితం.. నదిపైనే జీవనం!

- కృష్ణమ్మను నమ్ముకున్న మత్స్యకారులు
- గాజుల్లంక రేవు నుంచి శ్రీకాకుళానికి నిత్యం పడవ ప్రయాణం
- సురక్షితంగా ఇవతల ఒడ్డు నుంచి అవతలకు ప్రయాణికులు
- వచ్చిన ఆదాయాన్ని సమానంగా పంచుకుంటున్న మత్స్యకార కుటుంబాలు


గాజుల్లంక నుంచి శ్రీకాకుళానికి ప్రయాణికులను తరలిస్తున్న పడవ


ద్విచక్ర వాహనాలను కూడా పడవలోకి ఎక్కిస్తున్న మత్స్యకారులు

కొల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారికి కృష్ణమ్మే ఆధారం.. నిత్యం కృష్ణానదిపైనే జీవనం చేస్తూ వచ్చిన చాలీచాలని ఆదాయాన్ని సమానంగా పంచుకుని మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. భారీ వరదల్లో సైతం తమ ప్రాణాలు పణంగా పెట్టి లంక గ్రామాల్లో ప్రజలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. వారి జీవనం రోజూ సాహసమే. కొల్లూరు మండలంలోని గాజుల్లంక గ్రామంలో సుమారు 400 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారిలో కొంతమంది కృష్ణానదిలో చేపల వేట సాగిస్తారు. మరికొన్ని కుటుంబాలు నదిలో నీరు ఉన్నప్పుడు తమ పడవల ద్వారా ప్రయాణికులను నదిలో ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు దాటిస్తూ వారు ఇచ్చింది తీసుకుని అందరూ సమానంగా పంచుకుంటారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉన్నప్పుడు గాజుల్లంక నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే పడవలే శరణ్యం. గాజుల్లంక రేవు నుంచి నిత్యం వందలాది మంది తెనాలి, వేమూరు, అమృతలూరు, కొల్లూరు తదితర ప్రాంతాల నుంచి కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళంకు పడవల ద్వారా ప్రయాణం చేస్తుంటారు. వారితోపాటు ద్విచక్ర వాహనాలను సైతం పడవల ద్వారా తరలించుకుంటారు. రోడ్డు మార్గాన కొల్లూరు నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే సుమారు 40-45 కి.మీ దూరం ఉంటుంది. అదే గాజుల్లంక నుంచి కృష్ణానదిలో పడవల ద్వారా కేవలం ఏడు, ఎనిమిది కి.మీ మాత్రమే. దీంతో ప్రయాణ సమయం కలిసి వస్తుంది. పైగా పడవల ద్వారా ఇవతల ఒడ్డు నుంచి అవతల ఒడ్డుకు వెళ్లాలంటే రవాణా ఛార్జీలు కూడా తక్కువ కావడంతో తెనాలి పరిసర ప్రాంతాల ప్రజలు పడవలనే ఆశ్రయిస్తున్నారు.

సురక్షితంగా ప్రయాణం...

గాజుల్లంక మత్స్యకారులు ప్రయాణికులను ఎంతో సురక్షితంగా శ్రీకాకుళం ఒడ్డుకు వారి ద్విచక్ర వాహనాలతోసహా చేరుస్తారు. కృష్ణానది మొత్తం వారికి కొట్టిన పిండి. ఎక్కడ లోతు, ఎక్కడ మెరకలు ఉన్నాయి, మెరకలు తగలకుండా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా ప్రయాణికులను, వారి ద్విచక్ర వాహనాలను జాగ్రత్తగా చేరుస్తారు. పడవ నడిపే వారు చిన్నప్పటి నుంచి శిక్షణ పొందడం వలన ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు పడవ ప్రమాదాలు సంభవించలేదు. ఇందుకు ప్రధాన కారణం వారు తీసుకునే జాగ్రత్తలే. మర పడవ సామర్థ్యానికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించరు.

పడవలు నడిపే వారంతా గజ ఈతగాళ్లే..

ఇక్కడ పడవలు నడిపేవారు చిన్నప్పటి నుంచి తమ పెద్దల వద్ద శిక్షణ పొందడంతోపాటు గజ ఈతగాళ్లు. కృష్ణానదిలో కొల్లిపర దిగువ నుంచి ఒలేరు వరకు ఎవరన్నా గల్లంతయితే పోలీసులు సైతం వారిని సంప్రదించి తీసుకు వెళ్తారు. గల్లంతయిన వారి మృతదేహాలను వెతికి తీసి అప్పగిస్తారు.

రెండు గ్రామాల వారికి ఉచిత ప్రయాణం

పడవ ప్రయాణం ఆ రెండు గ్రామాల ప్రజలకు ఉచితమే. గాజుల్లంక, శ్రీకాకుళం గ్రామాల ప్రజలు పడవ ప్రయాణం ఉచితంగా చేస్తుంటారు. ఇందుకు ప్రతి ఫలంగా మత్స్యకారులకు అవసరమైనప్పుడు తమ వంతుగా సహాయ సహకారాలు రెండు గ్రామాల ప్రజ లు అందిస్తుంటారు. మత్స్యకారులకు చేపల వేట విరామ సమయంలో ఈ రెండు గ్రామాల ప్రజల సహాయం ఊరటనిస్తుంది.

ఆ రెండు నెలలు పస్తులే...

చేపల వేట విరామ సమయంలో వారికి పస్తులు తప్పవు. అదే సమయంలో కృష్ణానదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో పడవ ప్రయాణాలు కొనసాగవు. ఈ సమయంలో ఇతర పనులు కూడా ఉండవు. దీంతో ఆ రెండు నెలలు ప్రభుత్వ భృతితో సర్దుకుని జీవనం సాగించడం అలవాటుగా మారింది. భృతి కూడా ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నరసరావుపేట రూరల్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్ల లో రూ.15లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే అరవిందబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం అరవిందబాబు మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎంల సహకారంతో గుంతలులేని రోడ్ల నిర్మాణంపై దృష్టి పెడుతుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై, సంక్షేమం, అభివృద్ధిలో ముందుంటుందన్నారు.

మునిసిపాలిటీలో ఈవీ ఆటో మాయం?



ఆటో (ఫైల్ ఫొటో)



ఆటోలో ఉండాల్సిన ఫాగింగ్ యంత్రం

నరసరావుపేట పురపాలక సంఘంలో యంత్రాలు.. వాహనాల సంరక్షణను గాలికొదిలేశారు. వీటి లెక్కలు కూడా మునిసిపాల్టీలో లేవు. ఇందుకు సంబంధించిన రికార్డుల నిర్వహణ నామమాత్రమే. మునిసిపాల్టీకి సంబంధించన ఆటో ఒకటి మాయమైంది. కొద్ది నెలలుగా ఈవీ ఆటో మునిసిపాల్టీలో కనిపించడంలేదు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ పట్టణంలో దోమల నివారణకై ఫాగింగ్ కోసం ఎలక్ట్రానిక్ ఆటోను మునిసిపాల్టీకి ఇచ్చింది. ఫాగింగ్ నిర్వహణకు ఆటో వినియోగించడంలేదు. ఆటోలోని ఫాగింగ్ యంత్రం మాత్రం మునిసిపాలిటీ వాహనాల షెడ్‌లో ఉంది. ఆటో మాత్రం కనిపించడంలేదు. మరమ్మతుల కోసం గుంటూరు పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇది వాస్తవమేనా అనే సందేహాలు నెలకొన్నాయి. మునిసిపాల్టీలో లేని ఈవీ ఆటో విషయంలో అధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో చూడాలి. ఒక వేళ మరమ్మతులకు పంపి ఉంటే తీసుకొచ్చి ఫాగింగ్‌కు వినియోగించేందుకు అధికారులు కృషి చేయాలి.

- నరసరావుపేట, ఆంధ్రజ్యోతి

శివాలయాల్లో వైభవంగా కార్తీక అభిషేకాలు

నరసరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక సోమవారం పురష్కరించుకొని శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో పెద్ద ఎత్తున దీపారాధనలు చేశారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళేశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయం, బాలయ్య నగర్ శివాలయంలో అభిషేకాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. పల్నాడు రోడ్డులోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహాశివుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. మహాశివునికి భక్తులు ప్రదక్షణలు చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, కోదండ రామాలయం, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, సంతగుడిపాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శివాలయాల్లో స్వామివార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలను నిర్వహించారు.

● నరసరావుపేట అర్బన్: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామికి, ఆలయ ఆవరణలోని కామేశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో రొంపిచర్లలోని శంకరస్వామి



భీమలింగేశ్వర స్వామికి విశేష అలంకారం

ఫ్లైఓవర్ నుంచి పడి ఉద్యోగి మృతి

నాదెండ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన జంపని ప్రసాదు (38) అనే యువకుడు బాపట్ల జిల్లా పర్చూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. చీరాలలోని ఒక ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్న ప్రసాదు ఆదివారం రాత్రి 8గంటల సమయంలో మోటారు బైక్‌పై స్వగ్రామమైన గణపవరంనకు వస్తూ బాపట్ల జిల్లా పరుచూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వంతెన పైకి వెళ్ళాడు. ఆ వంతెన సంగం వరకే నిర్మించి ఉండటంతో ద్విచక్ర వాహనంతో సహాయ కిందపడ్డాడు. సోమవారం ఉదయం స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు తెలియజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అప్పటికే ప్రసాదు మృతి చెందినట్టు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కు టుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు భార్య అశ్విని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నకిలీ చెవికమ్మల అమ్మకంపై విచారణ

శావల్యాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచికలపాలెం గ్రామ పశుసంవర్ధకశాఖ సహాయకుడు బ్రహ్మేశ్వరరావు అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఫిర్యాదుపై నరసరావుపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ ఏడీఏ రామచంద్రరావు శావల్యాపురం పశువైద్యశాలలో సోమవారం విచారణ చేపట్టారు. బ్రహ్మేశ్వరరావు గ్రామానికి చెందిన పోట్ల ప్రతాప్‌తో కలసి నకిలీ చెవికమ్మలు అమ్మినట్లుగా, పశువుల బీమా పథకానికి పశువుల వివరాలను అంతర్జాలంలో తప్పుగా నమోదుచేసి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లుగా అదే గ్రామానికి చెందిన ముండ్రు మల్లికార్జునరావు, చిమటా మణికంఠ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఫిర్యాదుదారులు, గ్రామస్థులను విచారించారు. ఏడీఏ మాట్లాడుతూ జాతీయ పశుగణన కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధకశాఖ సిబ్బంది గ్రామాల్లోని పశుపోషకులను కలసి వివరాలు సేకరించి కేంద్రప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారని, పశుపోషకులంతా వారికి సహకరించాలన్నారు.

ఘనంగా కార్తీక మాస వనమహోత్సవం

శావల్యాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శావల్యాపురం నుంచి కొత్తలూరు వెళ్ళే మార్గంలోని శ్రీరామపబ్లిక్ స్కూల్‌లో వనమహోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మట్టి, కాగితాలతో విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తయారుచేసి అందరినీ ఆకట్టుకొన్నారు. ముఖ్య అతిథులుగా ఈపూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వైసీపీ నేత ముండ్లమూరి అనిల్‌కుమార్, శావల్యాపురం టీడీపీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, కాకాని వేణు, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఎంఈవో పుసులూరి లలితాకుమారి, ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఆర్ఐ నాసరయ్యలు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సైబర్ భద్రతపై అవగాహన

నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక యుగంలో వ్యక్తిగత భద్రతను కాపాడుకోవడానికి సైబర్ భద్రత ఎంతో అవసరమని నెషనల్ సెక్యూరిటీ డేటాబేస్ సర్టిఫైడ్ సైబర్ క్రైమ్ ఇంటర్వెన్షన్ ఆఫీసర్ కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. సోమవారం ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి ప్రదీప్ సైబర్ నేరాలపై అవగాహన, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా భారతి

శావల్యాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా మండలంలోని కృష్ణాపురంనకు చెందిన గోనుగుంట్ల భారతిని గ్రామ సమైఖ్య ఈసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు మండల సమాఖ్య ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు తెలిపారు. ఇటీవల జరిగిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు.

నూతన రేషన్‌షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రేషను డీలర్లు మరణం తర్వాత ఏర్పడిన ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వినుకొండ తహసీల్దార్ సురేష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉప్పరపాలెం (బీసీ మహిళ), చీకటీగలపాలెం (ఎస్సీ వికలాంగ), వినుకొండ పట్టణంలోని 9వ నెంబర్ షాపు (ఓసీ), నిర్వాహకులు లేకపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయని, ఖాళీల భర్తీతోపాటు పెదకంచర్ల (ఎస్సీ) ఏనుగుపాలెం (ఓసీ మహిళ), చెట్టుపల్లి (ఓసీ), నాగులవరం (ఓసీ)గ్రామాల్లో నూతన షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 4వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 9వ తేదీన రాత పరీక్షలతో పాటు 11వ తేదీన మౌఖిక పరీక్షల అనంతరం నియామకాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కల్గిన వ్యక్తులు రేషన్‌షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.



విజేతలను అభినందిస్తున్న స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బర్నబాస్ తదితరులు

కరాటే పోటీలలో కే-రిడ్జ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన అమరావతి ఓపెన్-2024 రెండో జాతీయ స్థాయి కరాటే పోటీలలో కే-రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ బర్నబాస్ సోమవారం తెలిపారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 250మంది విద్యార్థులు హాజరు కాగా కటా విభాగంలో కే-రిడ్జి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పల్నాడు జిల్లా ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారని అన్నారు. 11 సంవత్సరాల క్యాటగిరిలో జె ఉపజ్ఞ మొదటి, పీ నమస్వీ రెండవ, ఎం మధు హరిణి మూడో బహుమతి సాధించారన్నారు. 12 సంవత్సరాల విభాగంలో సీహెచ్ నిక్షిప్, టీ తేజ రాహుల్, ఎన్ గురు హంసిణీ, 13 సంవత్సరాల విభాగంలో సీహెచ్ నీరీక్షణ, ఎంఎస్ఎస్‌వీ స్వస్తిక, ఏ హర్షిణి, 14 సంవత్సరాల విభాగంలో జీ చైతన్య పవన్ కుమార్, కే నరసింహారెడ్డి, జీ సందీప్ వరుస బహుమతులను సాధించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాహుజీ, అకడమిక్ కో-ఆర్డినేటర్ హేమంత్ అభినందించారు.

ఫిర్యాదులను పరిష్కరించండి: ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, నవంబరు 25: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం అయన పాల్గొని 67 ఫిర్యాదులను స్వీకరించారు. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన షేక్ మస్తాన్ బి పులుకూరు లక్ష్మి వద్ద చీటీ వేశానని డబ్బులు ఇవ్వకుండా అదనంగా ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నట్లు నరసరావుపేటకు చెందిన చిన్న మేకల సత్యవతి ఫిర్యాదుచేసింది. నరసరావుపేట వరవకట్టకు చెందిన నాజెండ్ల నాగ సాయి రజినికి ఐదు సంవత్సరాల క్రితం ఒంగోలుకు చెందిన వ్యక్తితో వివాహం కాగా, మూడు నెలలు గర్భవతిగా ఉన్న సమయంలో భర్త చనిపోయాడు. ఆ సమయంలో అత్త మామూలు బాగా చూసుకుంటామని నమ్మించి, అనంతరం ఆడపిల్ల పుట్టిన తర్వాత తనపై హత్యాయత్నానికి వడిగట్టినట్లు ఫిర్యాదుచేశారు. వినుకొండకు చెందిన ఇందిరాదేవి బంగారు ఆభరణాల చోరీపై ఫిర్యాదు చేశారు. నరసరావుపేట మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన మన్నేపల్లి బ్రహ్మయ్య కుమారునికి ఉద్యోగం ఇప్పిస్తానని నాగేశ్వరావు అనే వ్యక్తి 2,33,000తీసుకొని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. నాదెండ్ల మండలం మేరికపూడి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు గుంటూరుకు చెందిన శ్రీవిజయ భాస్కర్ ట్రేడర్స్ వారికి 648 బస్తాలు అమ్మారని వాటి విలువ సుమారు 42 లక్షల 65 వేల రూపాయలు ఉంటుందని ఆ నగదు కోసం ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు చేశారు.

మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన

పోట్లూరు (శావల్యాపురం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు, పరిసరాల పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలని పంచాయతీ కార్యదర్శి యాకోబు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోట్లూరులోని ప్రజలకు మరుగుదొడ్ల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

పేదలకు నివాస స్థలాలివ్వాలి: ముప్పాళ్ళ

వినుకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హతలు కలిగిన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లడుతూ సీపీఐ పోరాటం ఫలితంగా రాష్ట్రంలో నిరుపేదలకు పించన్లు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ.ఆంజనేయులు 5వేల మందికి టిడ్కో కాలనీలో లబ్ధిదారులకు నివాస గృహాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పేద వారి గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. నివాస గృహాలు, స్థలాలు అవసరమైన వారు కమిటీలుగా ఏర్పడి సచివాలయాల్లో వినతిపత్రాలు అందించాలన్నారు. అనంతరం నిరుపేదల వద్ద తీసుకున్న అర్జీలను తహసీల్దార్ సురేష్‌కు అందజేశారు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ల మొత్తాన్ని పెంచి ఇవ్వటంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు సండ్రపాటి సైదా, పఠాన్ లాల్‌ఖాన్, ఉలవలపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో అంతర్జాతీయ స్థాయికి జగన్‌రెడ్డి ఖ్యాతి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతితో జగన్‌మోహనరెడ్డి ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరిందని, అమెరికాలోని దర్యాప్తు సంస్థలు సైతం నిర్ధారించాయని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మలపాటి శ్రీధర్ మాట్లాడుతూ తాడేపల్లి అవినీతి అనకొండ చరిత్ర సప్తసముద్రాలు దాటిందన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఏదైనా కుంభకోణం జరిగితే రాష్ట్రంలో మాత్రమే చర్చ జరిగేదని, ఇప్పుడు జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా జగన్‌మోహన్‌రెడ్డి గురించి చర్చించుకునే పరిస్థితి నెలకొందన్నారు. జగన్‌మోహనరెడ్డి చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వెనుక లక్ష కోట్ల కుంభకోణం ఉందని, తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు అది ఆధారాలతో సహా బహిర్గతమైందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహనరెడ్డి రూ.8లక్షల కోట్ల అవినీతికి పాల్పడి, రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి నెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు చంద్ర అంజనేయులు పాల్గొన్నారు.

జగన్ అవినీతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడిన వ్యవహారంపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వినుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఆయన అనుచరులకు రూ.1750కోట్లు అందజేయటంపై విచారణ జరగాలన్నారు. అదానీ మూడుసార్లు తాడేపల్లికి వచ్చి జగన్మోహన్‌రెడ్డిని కలిస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారని, అమెరికాలో కేసు నమోదై లంచాల భాగోతం బయటకు వచ్చిందన్నారు. జాయింట్ కమిటీతోపాటు సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే జగన్‌మోహనరెడ్డి అక్రమాల వివరాలు బయటకు వస్తాయన్నారు.

ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల ప్రారంభం

నరసరావుపేట లీగల్, నవంబర్ 25, పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని ఆవులసత్రం వద్ద సోమవారం ఎంవీ రెడ్డి కంటి వైద్యశాలను ఘనంగా ప్రారంభించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వైద్యశాలను ప్రారంభించారు అనంతరం కళ్ళజోళ్ళు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలి అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మొట్టమొదటిసారిగా కార్పొరేట్ హంగులతో ఏర్పడిన హాస్పిటల్ అని కొనియాడారు డాక్టర్ సృజన నరసరావుపేటలో ప్లాస్టిక్ సర్జరీ చేయడంలో మంచిదిట్టని కొనియాడారు. డాక్టర్ కడియాల లక్ష్మి, డాక్టర్ వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ జిల్లాలో మెరుగైన వైద్యసేవ చేయడంలో ఏవీ రెడ్డి సుప్రసిద్ధులు అని కొనియాడారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, ఆదిరెడ్డి ఐఎంఎస్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివా[స]రెడ్డి, డాక్టర్ రామలింగారెడ్డి, వెంకటరావు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, బ్రహ్మరెడ్డి డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వినోద్ కుమార్ రెడ్డి, డాక్టర్ వరబాబు, ఇంకా పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కారు ఢీకొని చిన్నారి మృతి

సరూర్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరు బయట ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వినుకొండకు చెందిన తిరుపతయ్య, వెంకటమ్మ దంపతులు పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి భూపేశ్‌గుప్తానగర్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం అమీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ రోడ్డులో వారి కుమార్తె బాలమ్మ(2) ఇంటి బయట ఆడుకుంటుండగా వేగంగా దూసుకు వచ్చిన కారు పాపను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. డ్రైవర్ పారిపోతుండగా స్థానికులు పట్టుకుని మీర్‌పేట్ పోలీసులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత నియమాలపై అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, నవంబరు 25: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం పట్టణంలో రోడ్డు భద్రత నియమాలు ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నుంచి మల్లమ్మ సెంటర్ మీదుగా హార్డ్ హైస్కూల్ వరకు నిర్వహించారు. మల్లమ్మ సెంటర్లో పాఠశాల విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ సీహెచ్ లోకనాథం, సీఐ హైమారావులు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం రోడ్డు భద్రత నియమాలను పాటించకపోవడం అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ అవగాహన ర్యాలీకి సహకరించిన మునిసిపల్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రవికాంత్‌ను ఉపాధ్యాయులను పోలీస్ అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వేణు ఒకటో పట్టణ ఎస్ఐ అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపు డీలర్ల నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న చౌక ధరల డీలర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ ఏ నళిని తెలిపారు. కొండ్రముట్ల షాపు నెం.17 (ఎస్‌టీ), ముప్పాళ్ళ షాపు నెం 20 (ఎస్సీ), షాపు నెం 21 (ఎస్సీ, మహిళ), ఈపూరు షాపు నం 26 (బీసీ-డీ),కొచ్చెర్ల షాపు నెం 24 (ఎస్సీ)కు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వయసు 18-40 మధ్య ఉండి, ఇంటర్మీడియట్ చదివిన వారు అర్హులన్నారు. 10 వతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, వయస్సు ధ్రువపత్రం, టీసీ, మూడు పాస్‌పోర్టు సైజు పోటోలు, కుల, నివాస స్థల ధృవీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. రాత పరీక్ష డిసెంబరు 9 వ తేదీన, మౌఖిక పరీక్ష 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్, ఇతర అధికారులు

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

● జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్

నరసరావుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 34మంది అర్జీదారులు వినతులను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూలల నుంచి అర్జీదారులు వస్తుంటారని అన్నారు. సత్వర పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై వినతి

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా నాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో ఉన్నారని అన్నారు. కనీస వేతనం ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఏ స్కూల్‌లో కూడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారని అన్నారు. వచ్చే మార్చికి పదో తరగతి పరీక్షలు విద్యార్థులు రాయబోతున్నారని, సిలబస్ పూర్తి కాకపోవడం వలన ఇబ్బందికరమైన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం గుర్తించి కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, జీ రామకృష్ణ, నల్లపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

సీసీఐ మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

తిమ్మాపురం (యడ్లపాడు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాల్సిన బాధ్యత కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) దేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలోని తిరుమల కాటన్ మిల్లులో సీసీఐ ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. పత్తి కొనుగోలు చేస్తున్న తీరు, రైతులకు లభిస్తున్న మద్దతు ధర గురించి రైతులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు విషయంలో కేంద్రంపైన, సీసీఐపైన తెచ్చిన ఒత్తిడి ఫలించిందన్నారు. పత్తి రైతుల ఇబ్బందులపై అసెంబ్లీలో తాను ప్రస్తావించానని, అలాగే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రంతో మాట్లాడడం జరిగిందన్నారు. తమ పోరాటం ఫలితంగా కేంద్రం నిబంధనలు సడలించి 15శాతం వరకూ తేమ ఉన్నప్పటికీ కొనుగోలుకు అంగీకరించిందన్నారు. ఇప్పటికే పత్తి మిల్లులు దెబ్బతిన్నాయని, సరైన మద్దతు ధర ఇవ్వకుండా రైతులను నష్టాలపాలు చేస్తే వారు పత్తి వేయడం మానివేస్తారని ప్రత్తిపాటి హెచ్చరించారు. చివరి క్వింటా వరకు పత్తి కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా రైతులకు ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు.

ఉమ్మడి సర్వే అనంతరం రైతులకు పరిహారం

● ఏపీ ట్రాన్స్‌కో డీఈఈ మురళీకృష్ణ

యడ్లపాడు, నవంబరు 25 (ఆంధ్రజోతి): హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద భూములు ఉన్న రైతులకు పరిహారాన్ని రెవెన్యూ, విద్యుత్‌శాఖల ఉమ్మడి సర్వే అనంతరం చెల్లించడం జరుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో (ఆపరేషన్స్) డీఈఈ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ విజయశ్రీని కలసి తీగెల కింద భూముల సర్వే చేసేందుకు సిబ్బందిని కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. అందుకు అంగీకరించిన తహసీల్దార్ బుధవారం నుంచి సర్వే చేసేందుకు అంగీకరించి సిబ్బందిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డీఈఈ విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ళకిందట సత్తెనపల్లి నుంచి ప్రత్తిపాడు వరకు 220 కేవీ టెన్షన్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అప్పట్లో టవర్లు ఏర్పాటు చేసిన భూమికి, నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించడం జరిగిందన్నారు. అయితే టవర్ల మధ్యన భూములు కలిగిన రైతులు తమ భూములపై నుంచి తీగెలు వెళ్ళడంతో భూములు విలువ కోల్పోయాయని, వాటికి కూడా పరిహారం అందించాలని కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఆదేశాలతో లింగారావుపాలెం, మైదవోలు గ్రామాల్లోని కొందరు రైతులకు భూమి మార్కెట్ విలువలో 10శాతం పరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఇటీవల యడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన రైతులు కూడా పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో టవర్లకు మధ్యన ఉన్న కారిడార్ (తీగెలు వెళ్ళిన ప్రాంతంను సర్వే చేయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు పరిహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పరిహారం చెల్లింపుకు సంబంధించి పలు విషయాలను డీఈఈతో చర్చించారు. రైతులు మాట్లాడుతూ మిగిలిన మండలాల రైతులు కూడా పరిహారంకోసం ప్రభుత్వానికి విన్నవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నూతలపాటి కాళిదాసు, ఉపసర్పంచ్ గోనుగుంట్ల హరిబాబు, టీడీపీ నాయకులు పోపూరి శివరామకృష్ణ, ఉప్పలపాటి శ్రీనివాసరావు, సీతారామయ్య, నూతలపాటి సుబ్బరామమూర్తి తదితరులు ఉన్నారు.

భోజనశాల నిర్మాణానికి నిధులు మంజూరు

శావల్యాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం జడ్పీ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా పాఠశాల ఆవరణలో భోజనశాల నిర్మాణానికి ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని మండల పరిషత్ నిధులు రూ.3లక్షలు మంజూరు చేసినట్లు పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. శ్రావణకుమార్ మాట్లాడుతూ భోజనశాల నిర్మాణానికి నిధులు మంజూరులో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తనవంతు సహకారాన్ని అందించినట్లు తెలిపారు. శావల్యాపురం జడ్పీ పాఠశాల పీఎంశ్రీ పథకానికి అర్హత సాధించినందున పీఎంశ్రీ నిధులతో పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకొనేందుకు వాలీబాల్ కోర్టు నిర్మాణపనులు జరుగుతున్నాయన్నారు. పీఎంశ్రీ నిధులతో త్వరలో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని, తాగునీటి అవసరాల నిమిత్తం ఆర్వోప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

కాశీవిశ్వేశ్వర ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధన

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సురేష్ మహల్‌రోడ్డులోని కాశీవిశ్వేశ్వర ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ న్యాయవాది సీహెచ్ మూర్తి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.